# పెన్నేటి కతలు

ఎండ సిమసిమలాడ్తాంది. ఇసకలో గుంత తీయడం సులువే అయినా మాంచి రేపటెండ అయినందువల్ల గుంత తీసే నాగడు, అంకడు, జొట్టుగాడు, కుంటోడు గసపోసుకొంటా వుండారు.

సొక్కాల్లేని వాళ్ళ పయి 1 మీద సెమట కాల్వలు కడతా వుండాది. వద్దు పొమ్మంటే ఇనకుండా ఎంబడే వచ్చిన పిల్లోళ్ళు ఎండకు తట్టుకోలేక అప్పుడప్పుడూ గవ్వాగోరింద 2 సెట్ల కిందికి పోయి, రోంత సేపుంటానే మళ్ళా వచ్చి నిలబడుకోని సూస్తా వుండారు. ఏట్లో ఎక్కన్నో జాలు పక్కన తీతవ కూస్తాంది. ఎవుడో పసుల్జీతగాడు 'సెల్లియో, సెల్లకో' అని పొద్దు గూకులూ అదే అంటా పాడతా వుండాడు.

"గుంత ఇంగా రోంత లోతుగా తీయండి, ల్యాకపోతే కుక్కలు నక్కలు తోడతాయి" అని పెద్దిరెడ్డి మాదిగోళ్ళను ఎచ్చరిచ్చినాడు. అవతల బట్టుకోడెను మోసుకొని తెచ్చిన కాడిమాన్లను ఇప్పి, దాన్ని ఒక పక్కకు పందుకో బెడతాండారు కొందరు. రామిరెడ్డి మాత్రం ఎట్ట కూచ్చున్నోడు అట్టనే వుండాడు. బుజం మీది తుండును నెత్తి మీదేసుకోడం కూడా మర్సిపోయి సూస్తా వుండాడు. సూడడం బట్టుకోడె దిక్కు సూస్తావున్నట్టు అనిపిస్తున్నా, ఇంగా అవతలి కెక్కడికో సూస్తా వున్నట్టుంది. నిజానికి ఇప్పుడు బట్టుకోడె కోడె కాదు. ఎప్పుడో కోడెగానీ ఇప్పుడది ముసిలి ఎద్దయిపోయింది. అయినా, దాన్ని బట్టుకోడె అనడం అలవాటయింది. శానా రోజులుగా కాయిలాతో వున్నా, ఇప్పటికీ పండుకొన్న ఏనిగ మాదిరిగా వుంది సూస్తాంటే.

తాను సేద్యం నేర్చుకోడం, బట్టుకోడె కాడి మరగడం ఇంచుమించు ఎనకా ముందుగా జరిగింది. కాడిమాను మొట్ట మొదట మెడమీంద పెట్నప్పుడు సక్కిలిగిలి పెట్టినట్టయేదో, ల్యాక బరువనిపిచ్చేదోగానీ పిల్లోడు గదా ఎగుళ్లేసి 3 నట్టు ఎగరడం ఇంగా గ్యాపకముంది. అదట్ట ఎగరడం సూసి, తన్తో పాటు నాయన గూడా ఎన్నోమాట్లు నగేవాడు. మాపటాల పూట ఈరికెమాను కట్టే ఈ ఏట్లో ఇసకలో నాయునా, తనూ దాన్ని కాడికి మరిపినారు. తొలీతగా 4 ఈరికెమాను మీంద తనొక్కడు కూకుంటేనే బరువైనట్టు నిలబడ్తా నిలబడ్తా ముక్కిముక్కి

## బట్టుకోడె



ఈడ్చేదల్లా ... రెండు మూడు వారాల్దిరిగే తలకి నాయనా, తనూ ఇద్దరెక్కినా లెక్క పెట్టకుండా లగ్గలు5 తీయ బట్టె! అప్పటికి అది పండ్లేయని దూడ, తను పద్నాలుగు, పదైదేండ్ల పిల్లోడు.

అట్టాటిది ఆరుబంటికి వచ్చేతలికి, పుట్ట సెండు 6 మాదిరి అంత వుండే సెండు పుట్ట పెరిగినట్టు పెరిగె. కాడిమాను పెడితే కనపడకుండా పోయే సన్నటి మెడ కాజే కానపడనట్టు బల్సిపాయె. అదట్ట తీరతాదని ఎవురూ అనుకోలా. అయితే, అట్టా తీరిందంటే ఊరికే తీరలేదులే. నాయనా, తనూ దాని పెట్టుబోతల యిసయంలో సూసుకొన్న జాగర్తే దాన్ని అట్ట తీర్చింది. మామూలుగా అయితే తమట్టాటి సన్న రైతులకు ఆ పెట్టుబోతలు అలివి గానివే. పస్లో దాని బిస జూస్తే మల్లమనం తినక పోయినా సరే దానికి పెట్టాల్సిందేనని ఏ కాపోడైనా అనుకోవలసిందే. అట్టనే అది బతికి నన్నాళ్ళూ ఏనాడూ పుటికె మేత ల్యాకుండా వుండలా.

దాన్నొక్కదాన్నే గాదు, దాన్జతదాన్ని గూడా అట్టనే సూసుకుంటా వచ్చినా, రెండు మూడేండ్లు బట్టుకోడెకు వలపట పనిజేస్తా వచ్చిందంటే, ఎంత మొనగాడైనా మెత్తపడిపోవాల్సిందే. ఇంత బిస గలిగినది మనకు యాలబ్బా అమ్మేదామా అనుకొంటే మల్లా మనసు రాకపాయె. బండికైనా, సేద్యానికైనా దాని నడకే నడక. ఆ తీరు కండ్లతో సూసి తీరాల కాపోడైన వాడు! తన పెండ్లి రోజు మెరవణి బండికి పోటు పెట్టే, అవతల మనుసులు పట్టుకొని, బట్టుకోడె నొక్కదాన్నే కట్టినారు. పెండ్లిగాబట్టి పకూర్కొళ్ళ వాళ్ళు గూడా వుండిరి. ఆ రోజు జనమంతా సూసింది, పెండ్లి కొడుకునూ, పెండ్లి కూతుర్నుగాదు. సెండు సుట్టూతా పూల దండతో, నడుం సుట్టూ సిలకలు కుట్టిన బొద్దు వారుతో, మొగం మీద కుచ్చుల జలతాళ్ళతో నడిసే బట్టుకోడెనే సూసినారు.

ఉగాది పండగ వచ్చిందంటే ఈ ఏట్లో ఇసకలో బండికి రెండు గాన్లు 7 తిరక్కుండా మోకుల్తో బిగ్గట్టే, పైన నిండా జనాన్ని ఎక్కిచ్చి, ఎన్నిమాట్లు దాన్తో ఈడిపిచ్చలేదు? ఒకసారి తూరుపు నుంచి అప్పుడప్పుడూ వచ్చే కోడెల యాపారి ఎంకయ్యనాయునికీ, నాయనకూ పందెంపడె. తను తోలుకొచ్చిన కోడెతో బరువు పట్టేదాన్ని ఈ సుట్టుపక్కల పదూళ్ళలో వుంటే తోలుకరమ్మని సవాల్జేసె, ఆ రోజు యిదే ఏట్లో ... యిక్కడికి మూన్నాలుగు పగ్గాల దూరాన వుండే ఆ ఇసుకలో ఎంత మంది గుంపయి సూసిరి! నాయుని కోడె ఉకిరికి తలకాయ నేలకేసి నిలబడి ...ముందుకు కదలకపాయె! అవుమానమయిందని ఆయన ములుగట్టె ఇరిగేట్టు దాన్ని కొట్టబడ్తే జనం పక్కకు ఇగ్గిరి8.

ఒక్క బిసలోనే గాదు. దాని తెలివి మనుసులకు యాడ్డి? ఆ రోజు బాగ్గ్యాపకముంది. పిల్లకాయలు దాని మీందబడి ఆడుకొంటున్నా

ఆంధ్రజ్యోతి వారపత్రిక 19-5-89

రాతి బసవన్న మాదిరి తలకాయ గూడా తిప్పకుండా వుంటాది గనుక, దాని మెడకు తలుగు పెట్టడమనే మాటే లేదు. బయట వున్నంత సేపూ వుండి ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడు గాటికాడికి వచ్చేది. ఆ రోజట్టా అది వాకిటికాడికి వచ్చేతలికి, తను రొంత యెనకాల వస్తాండాడు. ఎవురో కెవ్వున అర్చేసరికి సూస్తే ఇంగేముంది? ఇంట్లో వాకిలి కటుపక్క నుంచీ ... ఇదో ఇప్పుడు ఆ పిల్లోళ్ళతో పాటు వున్నాడే వాడు సివ్వోడు అప్పుడు నెలల పిల్లోడు దోగాడుకుంటా సరిగ్గా బట్టకోడె కాళ్ళ కిందికి వచ్చినాడు. అదేమో మామూలుగా తలకాయ పైకెత్తుకొని నెమరేసుకొంటా వాకిట్లోకి వచ్చి, కాలు ముందుకు పెట్టడానికి ఎత్తింది. తనొచ్చి పిల్లోన్ని ఎత్తుకొందామా అంటే ... బట్టకోడె వాకిటి నిండా నిలబడుకోనుంది. దాన్ని తప్పిచ్చుకొని ముందుకు రావడానికి యిల్లేకపాయె. ఇంగేముంది? అది దాని సివిగ కాలెత్తి పెట్టడమూ... పిల్లోని తలకాయ పగలడమూ తప్పదు. సూల్లేక కండ్లు మూసుకున్నాడు. పిల్లకాయ ఏడ్చేసరికి కండ్లు తెరిస్తే, ఎదురుగా అమ్మ జవురుకొని పిల్లకాయను సంకలో ఏసు కొని ఏడుస్తాంది. అబ్బాసి బయపడి వాడూ ఏడుస్తాండాడు. బట్టకోడె దిక్కు సూస్తే పాపం, ఎత్తిన కాలు కింద పెట్టకుండా సర్కస్సులో సివిగ మాదిరి అట్టనే వుండిపోయింది.

"పట్టండి, పట్టండి" అంటున్నారంతా. రామిరెడ్డి గ్యాపకంలో కొచ్చి సూసేసరికి బట్టకోడెను గుంతలో పడేసినారు. పారల్తో ఇసుక యేస్తున్నారు. రామిరెడ్డిని యెయ్యమన్నారు. రామిరెడ్డి మెల్లంగా లేసి, పార తీసుకొని ఇసకెయ్యబోతే సేతులు వొణకబట్టె. బట్టకోడె పాయంలో వున్నప్పుడూ, ముసల్దయినాక అది సేసిన పనీ, దాని గ్యాపకాలన్నీ మనసులో మెదిల్నాయి గానీ, యిప్పుడు అనిపిచ్చినట్టు యింతకు ముందెప్పుడూ అనిపిచ్చలా. పసువు సోయిన నష్టం తల్చుకోడం కాదది. అదెట్టాగూ పన్జేయలేని ముసల్దయిపోయింది. మరింగెందుకంటే .... వాలుగేండ్ల కిందట్ల ఇదే ఏట్లో వాళ్ళ నాయన సర్పిరెడ్డిని గుంతలో యేసి ఇసకతో బూడ్చడం గ్యాపకమొచ్చి... రామిరెడ్డి కండ్లల్లో నీళ్ళు తిరిగె.

— రామకృష్ణారెడ్డి

1. శరీరం 2. సీమతుమ్మ 3. గెంతివచ్చు 4. మొదట 5. పరుగులు 6. బంతి 7. చక్రాలు 8. లాగి















పాకిస్తాన్‌కు 'జిర్కోనియం' అక్రమ రవాణా! — వార్త